# ప్రభాత సూర్యుడు

తెలుగు దినపత్రిక

RANGAREDDY, EDITION : 01, VOLUME : 53, EDITOR:CHERUKU UPENDAR, DATE : THURSDAY 15 JUNE 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 53, ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : గురువారం 15 జూన్ 2023 పేజీలు : 4 వెల : 5/-


### తెలంగాణకు
## ఐదు గ్రీన్ యాపిల్ అవార్డులు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణను ఐదు అంతర్జాతీయ అవార్డులు వరించాయి. రాష్ట్రంలోని ఐదు నిర్మాణాలకు లండన్‌లోని గ్రీన్ ఆర్గనైజేషన్ అందిస్తున్న గ్రీన్ యాపిల్ అవార్డులు దక్కాయి. సచివాలయం, యాదాద్రి ఆలయం, మొజంజాహీ మార్కెట్, దుర్గం చెరువు, కమాండ్ కంట్రోల్ సెంటర్ నిర్మాణాలకు ఈ అరుదైన గౌరవం లభించింది. భారత్‌కు

మిగతా 2లో...

### బిపర్‌జాయ్ తుఫాన్
## ఉగ్రరూపం

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



బిపర్‌జాయ్ తుఫాన్ మరింత ఉగ్రరూపం దాల్చుతోంది. గుజరాత్ తీరం వైపు దూసుకొస్తూ అంతకంతకూ బలపడుతోంది. తుఫాన్ ధాటికి గుజరాత్ గజగజ వణికిపోతోంది. ఈ తుఫాన్.. గుజరాత్‌లోని జఖౌ వద్ద రేపు సాయంత్రం తీరం దాటనున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ద్వారక, కచ్ ప్రాంతాల మధ్య 150 కిలోమీటర్ల వేగంతో తీరాన్ని తాకనున్నట్లు అంచనా వేస్తోంది. అదే జరిగితే ఆ ప్రాంతంలో విధ్వంసం ఖాయంగా కనిపిస్తుంది. బిపర్‌జాయ్ తుఫాన్ పశ్చిమ తీరంలో పెను విధ్వంసం సృష్టించే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. దాంతో.. తీర ప్రాంతాల్లో విపత్తు బృందాలను మోహరించారు. గుజరాత్, మహారాష్ట్రలోని తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో లక్షా 30 వేల మందిని ఇప్పటికే సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తుఫాన్‌పై గుజరాత్ ప్రభుత్వం అప్రమత్తమైంది. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంది. మత్స్యకార గ్రామాలను ఖాళీ చేయించి.. సముద్రంలోకి వెళ్లకూడదని సూచించింది. తీర ప్రాంతాలకు

మిగతా 2లో...

### బీఆర్‌ఎస్ నేతల ఇళ్లల్లో...

- ఎంపీ, ఇద్దరి ఎమ్మెల్యేల ఇళ్లల్లో సోదాలు
- విలువైన డాక్యుమెంట్లు స్వాధీనం
- సెంట్రల్ ఫోర్స్ బందోబస్తు మధ్య ప్రక్రియ

# ఐటీ దాడులు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



తెలంగాణలో బీఆర్‌ఎస్ నేతల ఇళ్లలో ఐటీ సోదాలు కలకలం రేపుతున్నాయి. ఈరోజు ఉదయం నుంచి బీఆర్‌ఎస్‌కు చెందిన ఎంపీ, ఇద్దరు ఎమ్మెల్యేల ఇళ్లు, కంపెనీలు, షాపింగ్ కాంప్లెక్స్‌లలో ఐటీ అధికారులు సోదాలు చేయడం తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తెలంగాణలో అధికార బీఆర్‌ఎస్ పార్టీ నేతల ఇళ్లలో వరుసగా.. పైగా ఒకే రోజు ఏకకాలంలో ఐటీ అధికారులు సోదాలు చేయడంతో బీఆర్‌ఎస్ నేతల్లో ఆందోళన మొదలైంది. ముందుగా మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి నివాసాలపై ఐటీ అధికారులు తనిఖీలు చేపట్టారు. తెల్లవారుజాము నుంచే సోదాలు జరుగుతున్నాయి. కొండాపూర్‌లోని లుంబిని ఎస్‌ఎల్‌ఎన్ స్ప్రింగ్స్ విల్లాస్‌లో ఎంపీ ఉండే ఇంటితో పాటు కార్యాలయాలపైన ఇన్కమ్ టాక్స్ అధికారులు సోదాలు జరుపుతున్నారు. సెంట్రల్ ఫోర్స్ బందోబస్తు మధ్య ఈ సోదల ప్రక్రియ

మిగతా 2లో...

### నైజీరియాలో ప్రమాదం...
## 100 మంది దుర్మరణం

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

నైజీరియాలో ఘోర ప్రమాదం జరిగింది. ఓ పడవ మునిగిపోయి దాదాపు 103 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో చిన్నారులూ ఉన్నారు. పడవ ఓవర్‌లోడ్ అవడం వల్ల నది మధ్యలో బోల్తా పడిపోయింది. రెస్క్యూ టీమ్‌తో పాటు పోలీసులు...గల్లంతైన వారి కోసం గాలిస్తున్నారు. ఇప్పటి వరకూ 100 మందిని గుర్తించి రక్షించినట్టు అక్కడి అధికారులు వెల్లడించారు. పదుల సంఖ్యలో ప్రయాణికులు గల్లంతైనట్టు తెలుస్తోంది. ఓ పెళ్లికి వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాద సమయంలో పడవలో దాదాపు 5 గ్రామాలకు చెందిన ప్రయాణి కులున్నారు. క్వారా రాష్ట్రంలోని నదిలో పడవ బోల్తా పడింది. దీనిపై ఆ రాష్ట్ర గవర్నర్ స్పందించారు. "పడవ మునిగిపోయిన ఘటనలో ఇంకా చాలా మందిని గుర్తించాల్సి ఉంది. ప్రాణాలతో బయట పడిన వాళ్లు ఇంకా ఆ ప్రమాదాన్ని తలుచుకుని భయపడిపోతున్నారు. చాలా మంది తమ బంధువులను పోగొట్టుకున్నారు. రాత్రి ఓ వెడ్డింగ్ పార్టీకి వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

### వైద్యానికి.. మానవ జీవితానికి..
## ఎడతెగని సంబంధం

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు




వైద్యానికి మానవ జీవితానికి ఎడతెగని సంబంధం ఉందని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. మానవజాతి ఉన్నంత కాలం వైద్యులు ఉంటారని చెప్పారు. అప్పు ఇచ్చు వాడు ఉండాలి.. వైద్యులు ఉండాలని గతంలో కవులు చెప్పారన్నారు. తెలంగాణ వచ్చాక ఆరోగ్యశాఖ అతికీలకమైనదిగా భావించామని తెలిపారు. 2014లో వైద్యరంగానికి బడ్జెట్‌లో రూ.2001 కోట్లు కేటాయించామని, 2023-24 నాటికి అది రూ.12,367 కోట్లకు చేరిందని వెల్లడించారు. వైద్యరంగానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యానికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు. 550 టన్నుల ఆక్సిజన్‌ను సొంతంగా ఉత్పత్తి చేసుకుంటున్నామని చెప్పారు. హైదరాబాద్‌లో నిమ్స్ దశాబ్ది బ్లాక్ నిర్మాణానికి ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో కరోనాను మించిన వైరస్‌లు వస్తాయని నిపుణులు చెప్పారన్నారు. వైద్య రంగం బలంగా ఉన్న చోట తక్కువ నష్టంతో బయట పడుతారని చెప్పారని తెలిపారు. అందుకే వైద్య రంగాన్ని రాష్ట్రంలో బలోపేతం చేస్తున్నామని వెల్లడించారు. పిల్లల పెరు గుదలలో సమస్యలు ఉండకూడదని న్యూట్రిషన్ కిట్లు అందిస్తున్నామని చెప్పారు. న్యూట్రిషన్ కిట్ ఇవ్వడం వెనుక చాలా ఆలోచన ఉందని సీఎం అన్నారు. ఈ కిట్లతో ఒక తరం ఆరోగ్యకరంగా ఉంటుందని వెల్లడించారు. వైద్యారోగ్య శాఖకు సహజంగా విమర్శలే ఎక్కువగా ఉంటాయని, ప్రశంసలు తక్కువన్నారు. ప్రభుత్వ దవాఖానల్లో సామర్థ్యానికి మించి రోగులు వచ్చినా డాక్టర్లు వైద్యం అందిసున్నారని తెలిపారు. మూరుమూల ప్రాం తాల్లో పనిచేసే వైద్యులకు ప్రత్యేక సౌకర్యాలు

మిగతా 2లో...

### డ్రగ్స్ కేసులో కబాలి నిర్మాత

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



సినిమా పరిశ్రమకు చెందిన మరో కీలక వ్యక్తిని డ్రగ్స్ కేసులో పోలీసులు అరెస్ట్ చేశారు. డ్రగ్స్ కేసులో సినీ నిర్మాత కేపీ చౌదరిని సైబరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. గత కొంత కాలంగా చౌదరి గోవాలో ఉంటున్నారు. ఆయన డగ్స్ వాడుతున్నట్టు తేలడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చౌదరి నుంచి కొకైన్ కూడా స్వాధీనం చేసుకున్నారు. ఇటీవలే సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో డ్రగ్స్ ముఠాను పోలీసులు పట్టుకున్నారు. వీరి నుంచి పెద్ద ఎత్తున మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. వీరి నుంచి డ్రగ్స్ తీసుకుంటున్న వారి వివరాలను సేకరించారు. ఈ

మిగతా 2లో...

### రాష్ట్రంలో
## భయంకరమైన పరిస్థితులు



నల్గొండ, ప్రభాత సూర్యుడు


సీఎల్పీ నేత భట్టి విక్రమార్క కనగల్లు లో మీడియాతో మాట్లాడారు. నేను రాజకీయ ఉపన్యాసం చెప్పడం లేదు... కేవలం మీతో మాట్లాడాలని చెబుతున్నా. ఆదిలబాద్ నుంచి వెయ్యి కిలోమీటర్లు పాదయాత్ర చేసుకుంటూ వచ్చాను. మీలాగా అనేక రైతులను, విద్యార్థలతోనూ, ఆడబిడ్డలోనూ, అడవిలోని ఆదివాసులతో, గిరిజనులతోనూ, మైనార్టీలతోనూ మాట్లాడాను. గొండలు ఎక్కాను.. గుట్టులు ఎక్కాను.. కోయగూడాల్లోకి, గోండు గూడాల్లోకి వెళ్లాను. ఎవరు చెప్పిపా ఒక్కటే మాట.. కొట్లాడి తెలంగాణ తెచ్చుకున్నాము. వచ్చిన రాష్ట్రంలో మాకు భవిష్యత్తే లేకుండా పోయింది. మాట్లాడాలంటే, అడగాలంటే భయం. ధరణి పేరుమీత భూమి గుంజుకుంటున్నారు.పోడు భూమి చేసుకుంటున్న గిరిజన భూమిని లాక్కుంటున్నారు. ఉద్యోగాలు వస్తామని ఎదురు

మిగతా 2లో...

### ధరణి పోర్టల్
## రాష్ట్రానికి జీవన్మరణ సమస్య

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



ధరణి పోర్టల్ రాష్ట్రానికి జీవన్మరణ సమస్య అని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం అయన గాంధీ భవన్ లో మీడియాతో మాట్లాడారు. ధరణి లేకపోతే రైతు బంధు,రైతు బీమా రాదని కేసీఆర్ చెబుతున్నారు. ధరణిని రద్దు చేస్తామన్న కాంగ్రెస్ ను బంగాళాఖాతంలో కలపాలని కేసీఆర్, కేటీఆర్ పదే పదే చెబుతున్నారు. ధరణి దోపిడీపై శోధిస్తున్నాకొద్దీ కొత్త విషయాలు బయటపడుతున్నాయి. ఈ 75 ఏళ్లలో ఏ రాజకీయ పార్టీ, రాజకీయ నాయకుడు ఇలాంటి దోపిడీకి పాల్పడలేదు. కేసీఆర్ ను అసెంబ్లీ ప్రాంగణంలో చెట్టుకు ఉరేసి చంపినా తప్పు లేదు. గల్ఫ్ దేశాల్లోలా కేటీఆర్ ను రాళ్లతో కొట్టి చంపినా తప్పు లేదు. ప్రభుత్వ పనిని ధరణి పేరుతో పూర్తిగా ప్రయివేటు కంపెనీ ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ కు కట్టబెట్టారు. రాష్ట్రంలో భూ లావాదేవీలన్ని ధరణి పోర్టలే నిర్వహిస్తోంది. ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ కంపెనీ గతంలో రూ.90 వేల కోట్లు బ్యాంకులను నిండా ముంచింది. దివాళా తీసిన కంపెనీతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఇది రాష్ట్ర ప్రభుత్వం చేసిన మొదటి తప్పు. ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ కు సబ్సిడరీ కంపెనీ టెర్రాసిస్ టెక్నాలజీస్ లిమిటెడ్ ను ఏర్పాటు చేశారు. ఇందులో 52శాతం వాటాను టెర్రాసిస్ కంపెనీ ఫిలిప్పీన్ కంపీని రూ.12745 కోట్లకు అమ్ముకుంది. 150 కోట్లతో వ్యాపారం చేసే టెర్రాసిస్ కంపెనీ

మిగతా 3లో...

### టీ 24 టిక్కెట్
## ధరలు పెంపు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



భాగ్యనగరం సిటీ బస్సుల్లో 24 గంటల పాటు ప్రయాణించడానికి వెసులుబాటు కల్పించే టీ-24 టికెట్ ప్రస్తుత ధరల్ని పెంచుతూ ఆర్టీసీ నిర్ణయం తీసుకుంది. సాధారణ ప్రయాణికులకు ఈ టికెట్ ధరను రూ.90 నుంచి రూ.100కి పెంచింది. సీనియర్ సిటిజెన్లు (పురుషులు, మహిళలు, 12 ఏళ్ల పైబడిన బాలికలు)కు రూ.80 ఉండగా.. దాన్ని 90 రూపాయలకు పెంచింది. ఈ మేరకు ఆర్టీసీ ఈడీ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ధరలు జూన్ 10 నుంచి జులై 31వ తేదీ వరకు అమల్లో ఉంటాయని ఉత్తర్వుల్లో వెల్లడించింది. గతంలో టీ-24 టికెట్ సాధారణ ప్రయాణికులకు రూ.100 ఉండగా.. ఏప్రిల్ 26న రూ.90కి తగ్గించింది. సీనియర్ సిటిజన్లకు

మిగతా 2లో...

## బిపర్‌జాయ్ తుఫాన్
# ఉగ్రరూపం

(మొదటిపేజీ తరువాయి)

చెందిన 30 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అయితే, తుఫాన్ కారణంగా 69 రైళ్లు రద్దయ్యాయి. మరో 58రైళ్లను పాక్షికంగా రద్దు చేసినట్లు పశ్చిమ రైల్వే తెలిపింది. తుఫాన్ ప్రభావంతో గుజరాత్, కేరళ, కర్నాటక, గోవా, మహారాష్ట్రల్లోని తీర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. గంటకు 160 నుంచి 170 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తున్నాయి. ప్రధానంగా.. గుజరాత్‌లోని సౌరాష్ట్ర, కచ్ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడుతున్నాయి. అయితే.. తుఫాన్ తీరానికి సమీపిస్తోన్న కొద్దీ తీవ్రత పెరుగుతోంది. అయితే, తీర ప్రాంతాల్లో వారిని ఇప్పటికే సురక్షిత ప్రాంతాలకు తరలించామని.. సహాయక చర్యల కోసం సైన్యాన్ని కూడా రంగంలోకి దించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. బిపర్‌జాయ్ తుఫాన్‌పై అత్యవసర సమీక్ష నిర్వహించారు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా. తుఫాన్‌పై ఇప్పటికే రాష్ట్రాలను అప్రమత్తం చేశామన్నారు అమిత్‌షా. సహాయక చర్యల కోసం ఔఆఖీఈ , ూఆఖీఈ బృందాలను సిద్ధం చేసినట్టు వెల్లడించారు. అటు.. గుజరాత్‌లోని తుఫాన్ పరిస్థితిని కేంద్ర ఆరోగ్య మంత్రి మన్‌సుఖ్ మాండవీయ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. తీరప్రాంతాల్లో పర్యటించి సహాయక సిబ్బందికి సూచనలు ఇచ్చారు.

## తెలంగాణకు
# ఐదు గ్రీన్ యాపిల్ అవార్డులు

(మొదటిపేజీ తరువాయి)

గ్రీన్ యాపిల్ అవార్డులు రావడం ఇదే ప్రప్రథమమని ఈ సందర్భంగా గ్రీన్ ఆర్గనైజేషన్ వెల్లడించింది. బ్యూటిఫుల్ వర్క్‌స్పేస్ బిల్డింగ్ కేటగిరీలో తెలంగాణ సచివాలయానికి, హెరిటేజ్ కేటగిరీలో మొజంజాహీ మార్కెట్‌కు, యూనిక్ డిజైన్ కేటగిరీలో దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జికి, స్పెషల్ ఆఫీస్ కేటగిరీలో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు, అద్భుతమైన మతపరమైన నిర్మాణాల విభాగంలో యాదాద్రి ఆలయానికి గ్రీన్ యాపిల్ అవార్డులు వచ్చాయి. మే 16న లండన్‌లో జరగనున్న అవార్డుల ప్రదానోత్సవంలో స్పెషల్ సీఎస్ అరవింద్ కుమార్ ఈ అవార్డులను అందుకోనున్నారు. కాగా, తెలంగాణకు ఐదు అంతర్జాతీయ అవార్డులు రావడం పట్ల సీఎం కేసీఆర్ హర్షం వ్యక్తం చేశారు.

**అసలేంటి గ్రీన్ ఆర్గనైజేషన్ అంతే ఏమిటి ?**

ది గ్రీన్ ఆర్గనైజేషన్ 1994లో లండన్‌లో ఏర్పాటైంది. ఇది ఒక స్వచ్ఛంద సంస్థ. ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణ గురించి ప్రచారం చేయడంతో పాటు.. ఇందుకు కృషి చేస్తున్న వారిని ఇది గుర్తించి అవార్డులు అందిస్తున్నది. ఈ మేరకు 2016 నుంచి గ్రీన్ యాపిల్ అవార్డులు మొదలుపెట్టింది. పర్యావరణ పరిరక్షణకు తమ వంతు కృషి చేస్తున్న సంస్థలు, కౌన్సిల్స్, కమ్యూనిటీలకు ఇది అవార్డులను అందిస్తున్నది. అత్యంత విశాలమైన ప్రదేశంలో ఆకర్షణీయంగా నిర్మించడంతో పాటు ఇతరత్రా విషయాలను పరిగణలోకి తీసుకుని భవన నిర్మాణాలకు ఇంటర్నేషనల్ బ్యూటిఫుల్ బిల్డింగ్స్ గ్రీన్ యాపిల్ అవార్డులను అందజేస్తున్నది. నివాసాలు, కోటలు, మ్యూజియం, బ్రిడ్జిలు, మతపరమైన స్మారక కట్టడాలు, వారసత్వ కట్టడాలు.. ఇలా వివిధ కేటగిరీల్లో ఈ అవార్డులు ఇస్తున్నది. గతంలో లండన్‌లోని బాఫ్టా ( బ్రిటిష్ అకాడమీ ఆఫ్ ఫిలిం అండ్ టెలివిజన్ ఆర్ట్స్), నేషనల్ మ్యూజియం ఆఫ్ ఖతార్, మలేసియాలోని జలాన్ మహ్‌కోట ఈ ప్రతిష్ఠాత్మక అవార్డులను అందుకున్నాయి.

## డ్రగ్స్ కేసులో
# కబాలి నిర్మాత

(మొదటిపేజీ తరువాయి)

క్రమంలోనే డ్రగ్స్ వాడుతున్న కేపీ చౌదరిని అరెస్ట్ చేశారు. రజనీకాంత్ 'కబాలి' సినిమాకు కేపీ చౌదరి నిర్మాతగా వ్యవహరించారు. గోవా కేంద్రంగా దేశవ్యాప్తంగా డ్రగ్స్ సప్లయ్ అవుతున్నట్టు గతంలో పోలీసులు గుర్తించారు. హైదరాబాద్ డ్రగ్స్ సప్లయ్ మూలాలను గుర్తించిన పోలీసులు.. మోస్ట్ వాంటెడ్ డ్రగ్స్ కింగ్ పిన్ ఎడ్విన్ ను కూడా అరెస్ట్ చేశారు. అయితే తర్వాత బెయిల్ పై విడుదలయ్యాడు. అంతకు ముందే డ్రగ్స్ కింగ్ పిన్ గోవా హిల్టాప్ యజమాని డిసౌజాని హైదరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. అయినప్పటికీ డ్రగ్స్ బిజినెస్ ఆగడం లేదు. డ్రగ్స్ వ్యాపారులు .. కొత్త పద్ధతుల్లో ప్రయత్నిస్తున్నారు. వీరికి నైజీరియన్ గ్యాంగులు సహకరిస్తున్నాయి. డ్రగ్స్ వినియోగదారుల నుంచి వాట్సాప్ కాల్స్, వాట్సాప్ చాటింగ్ ద్వారానే లావాదేవీలు జరుపుతారు. నైజీరియన్లు గోవాకు వివిధ మార్గాల ద్వారా డ్రగ్స్‌ను రవాణా చేసి, గోవా కేంద్రంగా దేశంలోని పలు ప్రాంతాలకు విక్రయిసున్నట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. హైదరాబాద్ డ్రగ్స్ వ్యవహారాలకు పూర్తి స్థాయిలో చెక్ పెట్టేందుకులు పోలీసులు ఇటీవలి కాలంలో భారీ ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు. మఖ్యంగా హైదరాబాద్‌లో డ్రగ్స్ కు అలవాటు పడిన వారిని గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. వారిపై నిఘా పెడుతున్నారు. పట్టుబడిన నిందితులను ఎప్పటికప్పుడు పోలీసు కస్టడీకి తీసుకొని డ్రగ్స్ దందాకు సంబంధించిన మరిన్ని కీలక విషయాలు రాబట్టి.. అసలు సప్లయ్ చైన్ నడుపుతున్న వారిని అరెస్ట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. హైదరాబాద్ ఎప్పుడు డ్రగ్స్ కేసు పట్టుబడినా టాలీవుడ్‌తో లింకులు కలుస్తున్నాయి. కేపీ చౌదరి కబాలికి నిర్మాతగా వ్యవహరించినా డ్రగ్స్ కు బానిసై.. తర్వాత అదే వ్యాపారం చేస్తున్నట్లుగా అనుమానిస్తున్నారు. ఈ వ్యవహారంలో మొత్తం లింకులు బయటకు తీసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

## బీఆర్ఎస్ నేతల
# ఇళ్లల్లో ఐటీ దాడులు

(మొదటిపేజీ తరువాయి)

కొనసాగుతోంది. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

అలాగే యాదాద్రి జిల్లాలో అధికార పార్టీ ఎమ్మెల్యే నివాసంలోనూ ఐటీ అధికారులు సోదాలు చేపట్టారు. భువనగిరి బీఆర్ఎస్ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి నివాసం, కంపెనీల్లో ఈరోజు ఉదయం నుంచి ఏకకాలంలో ఐటీ సోదాలు చేపట్టింది. భువనగిరి, హైదరాబాద్ కొత్తపేట గ్రీన్ హిల్స్ కాలానీలోని కార్యాలయాల్లో మొత్తం 12 చోట్ల ఐటీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. హిల్ ల్యాండ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్, మెయిన్ ల్యాండ్ డిజిటల్ టెక్నాలజీస్ లిమిటెడ్‌లలో ఐటీ సోదాలు జరుగుతున్నాయి. హిల్ ల్యాండ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్, మెయిన్ ల్యాండ్ డిజిటల్ టెక్నాలజీస్ లిమిటెడ్ కంపెనీలకు పైళ్ల శేఖర్ రెడ్డి భార్య వనిత డైరెక్టర్‌గా ఉన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యే శేఖర్ రెడ్డి కొత్తపేటలో ఉన్నారు. అటు ఎంపీ, ఇటు ఎమ్మెల్యే నివాసాల్లో ఏకకాలంలో ఐటీ సోదాలు చేయడంతో బీఆర్ఎస్ పార్టీలో టెన్షన్ నెలకొంది. ఎమ్మెల్యే నివాసంలో ఐటీ అధికారులు సుమారు 30 బృందాలతో ఈ సోదాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆదాయపన్ను చెల్లింపు వివరాలను పరిశీలిస్తున్నట్టు సమాచారం. పైళ్ల శేఖర్ రెడ్డి ఇంట్లో కీలక డాక్యుమెంట్లను ఐటీ సీజ్ చేసింది. రెండు కంపెనీలకు చెందిన డాక్యుమెంట్లు, ఆస్తుల పాత్రలను ఐటీ సీజ్ చేసింది. రెండు వాహనాల్లో రాజశేఖర్ రెడ్డి ఇంటి నుంచి ఐటీ అధికారులు మరో చోటకు వెళ్లినట్లు తెలుస్తోంది. ఇటు నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డికి చెందిన షాపింగ్ మాల్‌పై కూడా ఐటీ శాఖ దాడులు నిర్వహించింది. కేపీహెచ్‌బీ కాలనీలోని జేసీ బ్రదర్స్‌లో ఐటీశాఖ తనిఖీలు చేపట్టింది. ఈరోజు ఉదయం 6 గంటల నుండి సోదాలు కొనసాగుతున్నాయి. జేసీ బ్రదర్స్‌కు సంబంధించి నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి, అతని బంధువులు డైరెక్టర్లుగా కొనసాగుతున్నారు. జేసీ బ్రదర్స్‌లో జరిగిన లావాదేవీలపై అధికారులు ఆరా తీస్తున్నారు.

**ఏకకాలంలో ఐటీ తనిఖీలపై ఆసక్తికర చర్చ..**

అయితే కేంద్రమంత్రి, బీజేపీ నేత అమిత్ షా తెలంగాణ పర్యటన వేళ ఐటీ సోదాలపై సర్వత్రా చర్చ జరుగుతోంది. బీఆర్ఎస్ నేతలే టార్గెట్‌గా ఈ సోదాలు జరగడం తెలంగాణ రాజకీయ వర్గాల్లో పలు అనుమానాలకు తావిస్తోంది. మునుముందు మరికొంతమంది అధికార పార్టీ నేతల ఇళ్లలోనూ సోదాలు జరిగే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఐటీ తనిఖీలు జరగడం, అది కూడా అధికార బీఆర్ఎస్‌లో ఆర్థికంగా బలంగా ఉన్న నేతలే టార్గెట్‌గా సాగుతుండటంతో బీఆర్ఎస్‌లో కలవరపాటు మొదలైంది.

## రాష్ట్రంలో
# భయంకరమైన పరిస్థితులు

(మొదటిపేజీ తరువాయి)

చూస్తుంటే ఉద్యోగాలు రావడం లేదు. ఎక్కడా ఇల్లు లేదు.. వాకిలి లేదు. ఇండ్ల స్థలాలు కూడా ఇవ్వడం లేదు. ఉపాధిపనులు చేసుకునేవాళ్లకు కూలీ డబ్బులు కూడా ఇవ్వడం లేదు. వీటి గురించి ఎవరైనా అడగాలంటే భయం.. కేసులు పెట్టి ఎక్కడ జైల్లో వేస్తారని భయపడే రోజులు తెచ్చారని ఆరోపించారు.

రాష్ట్రంలో నేడు భయంకరమైన పరిస్థితులు నెలకొన్నాయి. ఈపరిస్థితుల్లో మా బతులకు బాగు చేసేందుకు తెలంగాణ ఇచ్చిన మీరే ఇందిరమ్మ రాజ్యాన్ని తీసుకురండని, అప్పుడే పేదలకు, రైతులకు, విద్యార్థులకు, మహిళకు అందరికీ న్యాయం జరుగుతుందని చెబుతున్నారు. ఆలేరు నియోజకవర్గంలో చూశాను.. పాదయాత్రగా నడుచుకుంటే వస్తుంటే.. ఉన్నత చదువులు చదుకున్న ఇద్దరు అన్నదమ్ములు మా వద్దకు వచ్చారు. వారివెంట ఇంటికి వెళ్లి చూశాను.. ఎదురుగా పెద్ద టేబుల్ మీద ఇస్త్రీ పెట్టె పెట్టుకుని బట్టలు ఇస్త్రీ చేసుకుంటున్నాను. అందులో ఒకరు ఉస్మానియా యూనివర్సిటీలో ఎమ్మెస్సీ ఫిజిక్స్ చదవగా.. మరొకరు బీఏ, బీఈడీ, ఎల్.ఎల్.బీ చదువుని బట్టలు ఉతికి ఇస్త్రీ చేసుకుంటూ జీవిస్తున్నారు. మాకు ఉద్యోగాలు లేవు.. రాష్ట్రం కోసం మా చదువులు పక్కన పెట్టి సకల జనుల సమ్మె చేశాం. వర్సిటీలో ధర్నాలు చేశాం.. రాష్ట్రం వచ్చింది కానీ.. ఉద్యోగాలు మాత్రం రాడం లేదని చెప్పారు. అచ్చంపేటలో చూశాను.. తెలంగాణ కోసం పోరాటం చేసిన జేఏసీ నాయకులు నన్ను కలిశారు. తెలంగాణ కోసం పెద్ద ఎత్తున మేమంతా ఉద్యమాలు చేశాం. ఇప్పుడు రాష్ట్రం వచ్చాక తొమ్మిదిన్నర సంవత్సరాల తరువాత వెనక్కి తిరిగి చూస్తే.. ఇటువంటి రాజ్యం కోసమా మా ప్రాణాలను ఫణంగా పెట్టి పోరాటం చేసింది అని పిస్తోందని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని చూసి సిగ్గుపడుతున్నామని చెప్పారు.

ఇప్పుడు నల్లగొండ జిల్లాకు వచ్చాను.. వచ్చే ముందు అచ్చంపేటలో ఎస్ఎల్బీసీ టన్నెల్ చూసి వచ్చాను. ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డిగారు నల్లగొండ జిల్లాలోని దాదాపు మూడున్నర లక్షల ఎకరాలకు సాగునీరు ఇచ్చేందుకు ఎస్ఎల్బీసీ టన్నెల్ పనులు ప్రారంభించారు. సొరంగం తవ్వేందుకు అవసరమైన అన్ని అనుమతులు తీసుకువచ్చాం. టన్నెల్ కు సంబంధించిన దాదాపు 32 కిలోమీటర్ల పనులను అప్పటికూ పూర్తి చేశాం. రాష్ట్రం వచ్చి పదేళ్లవుతోంది.. ఇన్నేళ్లలో పట్టుమని రెండు మూడు కిలోమటర్లు కూడా తవ్వలేని దౌర్భాగ్య ప్రభుత్వం ఇది.

ఎస్ఎల్బీసీ టన్నెల్ పనులు చూశాక.. బాధనిపించింది.. ఆలోచన చేస్తే.. రాష్ట్రం తెచ్చుకుంది నీళ్ల కోసమే కదా.. క్రుష్ణా నది జలాలు నల్లగొండకు తీసుకువచ్చేందుకు మొదలు పెట్టిన ఎస్ఎల్బీసీ టన్నెల్ ను, డిండి లిఫ్ట్ ఇరిగేషన్ పై నేను ఈ ప్రభుత్వాన్ని ప్రశ్నించాను. నిదులు ఎందుకు విడుదల చేయలేదని ఇక్కడ నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న మంత్రి జగదీశ్ రెడ్డి, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిను ప్రశ్నించాను.

ఎస్ఎల్బీసీ గురించి మాట్లాడమంటే.. నా పంచ గురించి, నా గోశ గురించి మాట్లాడతాడు. అయ్యా సుఖేందర్ రెడ్డి.. నాం పంచ, గోశ గురించి ఇద్దరం తరువాత మాట్లాడుకుందాం.. నీళ్ల గురించి చెప్పవయ్యా.. అంటే సమాధానం లేదు. పాదయాత్రలో అనేక గ్రామాల్లో ఎక్కడ అడిగినా.. రెండుగదులు ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వలేదు. దళితులకు మూడెకరాల భూమి రాలేదు. తెలంగాణ ప్రజల జీవితాల్లో ఎక్కడా మార్పు రాలేదు.. కానీ టీఆర్ఎస్ నాయకుల జీవితాల్లో మాత్రం అద్భుతమైన మార్పు వచ్చిందని అన్నారు.

తెలంగాణ నాలుగుకోట్ల మంది ప్రజలకు నీళ్లు రావాలి, నిధులు రావాలి, సంపద రావాలి, బిడ్డలకు కొలువులు రావాలని ఉద్యమాలు చేశారు. ఆత్మగౌరవం రావాలని తెలంగాణ తెచ్చుకున్నాం. కానీ అవేవీ రాలేదు. తెలంగాణ ప్రజలను అడ్డం పెట్టుకుని అధికారంలోకి వచ్చిన కేసీఆర్ కుటుంబం, ఇక్కడున్న జగదీశ్వర్ రెడ్డి కుటుంబం, గుత్తా సుఖేందర్ రెడ్డి కుటుంబం ఆస్తులు మాత్రం వేల కోట్లు పెరిగాయి. వారందరి జీవితాల్లో మాత్రం అద్భుతైన మార్పు వచ్చింది. తెలంగాణ తెచ్చుకుంది.. మీ జీవితాల్లో మార్పు కోసమా? లేక ప్రజల జీవితాల్లో మార్పు కోసమా? రావి నారాయణ రెడ్డి, చెకిలం శ్రీనివాస రావు, ఉపక్కునూతల పురుషోత్తం రెడ్డి, పాల్వాయి గోవర్ధన్ రెడ్డి, మల్లు స్వారాజ్యం, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, రవీంద్ర నాయక్, ధర్మ భిక్షం వంటి ఎందరో ప్రాతినిథ్యం వహించారు. కానీ వీళ్లందరి జీవితాలు ఒక్కసారి చూడండి. వీరంతా నల్లగొండ జిల్లా ప్రజల బాగోగుల గురించి ఆలోచించారు. అంతే తప్ప మీలా కోట్ల రూపాయలు సంపాదించుకోవాలని వారుచూడలేదు. మీలా ఫామ్ హౌస్ లు కట్టుకోలేదు. మీలా ప్రజలను వంచిస్తూ బతకలేదు. జగదీశ్ రెడ్డి, గుత్తా సుఖేందర్ రెడ్డి లాంటా వాళ్లతో నల్లగొండ జిల్లా ప్రజాలకు ఏలాంటి ప్రయోజనం ఉండదని అన్నారు.

తెలంగాణ తెచ్చుకున్నదే నీళ్ల కోసం.. మేయు మొదలు పెట్టిన ఎస్ఎల్బీసీ టన్నెల్ ను ఇన్నేళ్లలో ఉందకు పూర్తి చేయలేదని నేను ఇక్కడ నుంచి ప్రశ్నిస్తున్నాను. సకల జనుల సమ్మె, వంటావార్పు చేసి.. రాష్ట్రం తెచ్చుకున్న ప్రజలకు ఇంత వరకూ ఇండ్లు రాలేదు. ఇండ్ల స్థలాలు రాలేదు. మీకు మాత్రం ఫామ్ హౌస్ లు వచ్చాయి. తెలంగాణ బిడ్డలకు ఎందుక ఇప్పటి వరకూ ఉద్యోగాలు రాలేదు. రాష్ట్ర సంపద ప్రజలకు ఎందుకు పంచబడలేదని నేను అడుగుతున్నాను. నా ప్రశ్నలను సమాధానం చెప్పాల్సిన బాధ్యత గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రి జగదీశ్వర్ రెడ్డిపై ఉంది.

మరో ఆరు నెలల్లో ఇచ్చేది ఇందిరమ్మ రాజ్యమే. అప్పుడు రాష్ట్రంలో సంపద, వనరులు అన్నీ పేద ప్రజలకు పంచుతాం. ప్రతి పేద కుటుంబానిక రెండు గదుల ఇల్లు కట్టుకునేందుకు రూ. 5లక్షలు ఇస్తాం. ప్రతి పేద కుటుంబానికి గ్యాస్ ధరను రూ. 500 కే ఇస్తాం. ప్రతి అర్హత కలిగిన కుటుంబానికి రేషన్ కార్డు ఇవ్వడమే కాదు.. రేషన్ షాపులో 9 రకాల సరుకులు కూడా ఇస్తాం. భూమి లేని ప్రతి పేద కుటుంబానిక ప్రతి ఏడాది రూ. 12 వేలు ఇస్తాం. రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రూపాయాల రుణమాఫీ చేస్తాం. భూమిలేని కూలీనాలి చేసుకునే వారికి, వంద రోజుల పనికి వెళ్లేవారికి ఆమ్ ఆద్మీ బీమా యోజనపేరుతో ఇన్సూరెన్స్ చేస్తాం. రాష్ట్రంలోని ప్రతి బిడ్డ ఉచిత నిర్భంధ ఇంగ్లీష్ మీడియంలో కేజీ నుంచి పీజీ వరకూ చదివిస్తాం. రాజీవ్ ఆరోగ్య శ్రీ కార్డును రూ. 2 లక్షల నుంచి రూ. 5లక్షలకు పెంచుతాం. క్రుష్ణానదిపైన జూరాల, నెట్టంపాడు, కల్వకుర్తి, శ్రీశైలం, కోయిల్ సాగర్, భీమా, నాగార్జున సాగర్ మేమే కట్టాం. చివరికి ఎస్ఎల్బీసీ టన్నెల్ కూడా మేమే మొదలు పెట్టాం.. మేమే పూర్తి చేస్తాం.. నల్లగొండ ప్రజలకు సాగు నీళ్లిస్తామని అన్నారు.

# వైద్యానికి.. మానవ జీవితానికి..ఎడతెగని సంబంధం

(మొదటిపేజీ తరువాయి)


అందిస్తున్నామని వెల్లడించారు. గతంలో దవాఖానల్లో 30 శాతం డెలివెరీలు జరిగేవని, ఇప్పుడు 70 శాతానికి పెరిగాయన్నారు. వైద్యారోగ్య రంగంపై చక్కటి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. గతంలో ఉస్మానియా, గాంధీ, నోలోఫర్ వంటి దవాఖానలే దిక్కని, ఇప్పుడు వరంగల్‌లో ప్రపంచంలో లేని అద్భుతమైన హెల్త్ సిటీని కడుతున్నామని చెప్పారు. హైదరాబాద్‌లో మరో నాలుగు హాస్పిటళ్లు కడుతున్నామని వెల్లడించారు. రాష్ట్ర ప్రజలకు ఉత్తమ సేవలు అందించడానికి కృషి చేస్తున్నామని అన్నారు. కరోనా సమయంలో గాంధీ దవాఖాన అద్భుతమైన సేవలు అందించిందని చెప్పారు. ప్రైవేటు హాస్పిటళ్లు చేతులెత్తేసినా కరోనా రోగులను గాంధీ వైద్యులు కాపాడారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా గాంధీ సూపరింటెండెంట్ రాజారావు, వైద్యులు, సిబ్బందిని ముఖ్యమంత్రి అభినందించారు. అందరికి తెలంగాణ దశాబ్ది ఉత్సవాల శుభాకాంక్షలు తెలిపారు.

# టీ 24 టిక్కెట్ ధరలు పెంపు

(మొదటిపేజీ తరువాయి)

రూ.80కి అందించింది. తాజాగా పాత ధరల్ని పునరుద్ధరించింది.తెలంగాణ ఆర్టీసీ ఇ?వలే గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రయాణించే మహిళల ఆర్థిక భారం తగ్గించేందుకు వారికి టీ-24 టికెట్ ను రూ.80కే అందించాలని నిర్ణయించింది. సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్ ప్రెస్ బస్సుల్లో 24 గంటల పాటు ప్రయాణించే ఈ టికెట్ ధరను సాధారణ ప్రయాణికులకు రూ.90గా, సీనియర్ సిటిజెన్లకు రూ.80గా ఇటీవల టీఎస్ఆర్టీసీ యాజమాన్యం తగ్గించింది. మహిళా ప్రయాణికులకు రూ.10 తగ్గించి రూ.80కే అందించాలని నిర్ణయించింది. ఈ కొత్త టికెట్ ధరను మే 9వ తేదీ నుంచే అందుబాటులోకి తీసుకువచ్చింది. సిటీ పరిధిలో తిరిగే ఆర్డినరీ, మెట్రో ఎక్స్ ప్రెస్ బస్సుల్లోని కండక్టర్ల వద్ద ఈ టికెట్లు అందుబాటులో ఉంటాయి. గ్రేటర్ హైదరాబాద్ లో అందుబాటులోకి తీసుకువచ్చిన ఈ టీ-24 టికెట్ కు అనూహ్య స్పందన వస్తోందని టీఎస్ఆర్టీసీ ఛైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్దన్ రెడ్డి, ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. సిటీ బస్సుల్లో 24 గంటల పాటు ప్రయాణించే ఆ టికెట్ ధరను రూ.100 నుంచి రూ.90కి ఇటీవలే తగ్గించింది. కొత్తగా సీనియర్ సిటిజన్లకు రూ.80కే అందిస్తోంది. అయితే ఈ ధరలు తగ్గించినప్పటి నుంచి టీ-24 టికెట్ ను కొనుగోలు చేసే వారి సంఖ్య పెరిగిపోయిందట. ధర తగ్గింపు తర్వాత ప్రతి రోజు సగటున 40 వేల వరకు టీ-24 టికెట్లు అమ్ముడు అవుతున్నాయట. గతంలో రోజుకు 25 వేల మాత్రమే ఉండే ఆ సంఖ్య గణనీయంగా పెరిగింది. మహిళా ప్రయాణికులకు మరింత దగ్గర అయ్యేందుకు రూ.80కే టీ-24 టికెట్ ఇవ్వాలని సంస్థ నిర్ణించింది. అలాగే మహిళలు, సీనియర్ సిటిజెన్ల కోసం టీ-6 టికెట్ ను ఇటీవలే ప్రారంభించామని, రూ.50కి ఆ టికెట్ కొనుగోలు చేస్తే ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వారు ప్రయాణించవచ్చని చెప్పారు. కానీ తాజాగా మరోసారి ఈ టికెట్ ధరలను పెంచారు. ఎంబీబీఎస్ లో ఉన్న హైదరాబాద్ జోన్ ఈడీ ఆఫీస్ ను కాచిగూడలోని కమ్యూనిటీ ఎమినిటీస్ కేంద్రానికి, సిటీ బస్సులకు సంబంధించి జూబ్లీ బస్ స్టేషన్ లో ఉన్న గ్రేటర్ ఈడీ కార్యాలయాన్ని మిధానిలోని కమ్యూనిటీ ఎమినిటీస్ సెంటర్ కు మార్చనున్నారు. ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రధాన కార్యాలయం బస్ భవన్ ఈడీ ఆదేశాలు జారీ చేశారు.

# నాణ్యతా ప్రమాణాలు తప్పక పాటించాలి
## కార్పోరేటర్ కళ్యెం నవ జీవన్ రెడ్డి



**హాయత్ నగర్ - ప్రభాత సూర్యుడు :** హాయత్‌నగర్ డివిజన్ పరిధిలోని కురుమ బస్తిలో నూతనంగా నిర్మిస్తున్నటువంటి సిసి రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పోరేటర్ కళ్యెం నవ జీవన్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నవ జీవన్ రెడ్డి మాట్లాడుతూ..రాబోవు వర్షాకాలన్ని దృష్టిలో ఉంచుకొని వరద నీరు రోడ్లపై ఎక్కలా నిలిచిపోకుండా ఉండేలా లెవలింగ్ చూసుకోవాలని, రోడ్లు విషాలంగా ఉండేలా చర్యలు తీసులకోవాలని కాంట్రాక్టర్ మరియూ అధికారులనకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఇ నరేంద్ర తేజ, వర్క్ ఇన్స్పెక్టర్ సురేష్, బీజేపి సీనియర్ నాయకులు బండారి భాస్కర్, నాయకులు ఎర్రవెలి సత్యనారాయణ, గంగాని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ధరణి పోర్టల్
# రాష్ట్రానికి జీవన్మరణ సమస్య

(మొదటిపేజీ తరువాయి)

ఫాల్కాన్ కంపెనీకి నవంబర్ 25, 2021 న రూ.1275 కోట్లకు అమ్ముకుంది. కొనుగోలు చేసెకంటే ఒక నెల ముందు మాత్రమే ఫాల్కన్ కంపెనీ ప్రారంభించారు. ఇప్పుడు టెర్రాసిస్ కంపెనీ 99 శాతం వాటా ఫాల్కన్ కంపీనికి ఇచ్చేసింది. ధరణి పోర్టల్ పూర్తిగా శ్రీధర్ రాజు చేతుల్లోకి వెళ్ళిపోయింది. శ్రీధర్ రాజుకు, కేటీఆర్ కు ఉన్న సంబంధం ఏమిటని నేను ప్రశ్నించడం లేదు. కేసీఆర్ కు అసలు సిగ్గుందా? ఒడిశా ప్రభుత్వం 2010లో ఈ-ధరణి పేరుతో ఈ ప్రాజెక్టు లాంచ్ చేసింది. ఈ కంపెనీ నిర్వాకంపై 2017లో కాగ్ నివేదిక ఇచ్చింది. ధరణిని బంగాళాఖాతంలో పడేయాలని కాగ్ చెప్పింది. కేసీఆర్ తానే అద్భుతాలు చేసి ధరణిని సృష్టించినట్టు చెప్పారు. తన దోపీడీని కప్పి పుచ్చుకోవడానికి కేసీఆర్ అబద్ధాలు చెప్పారు. ధరణిలో ఇప్పటివరకు 25 లక్షల లావాదేవీలు జరిగాయి. ఇందులో రూ.50వేల కోట్ల లావాదేవీలు జరిగాయని అంచనా. ఇవన్నీ ప్రభుత్వ ఖాతాలోకి వెళ్లడంలేదు. ఇవన్నీ శ్రీధర్ రాజు కంపెనీ ఖాతాలోకి వెళుతున్నాయి. ఇక్కడే అసలు మతలబు ఉంది. రిజిస్ట్రేషన్ కు స్లాట్ బుక్ చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకోకపోతే తిరిగి డబ్బులు రావడం లేదు. మక్తల్ కు చెందిన ఆంజనేయులు గౌడ్ ఒక ఉదాహరణ. ఆన్ లైన్ లో మాత్రం డబ్బులు రిఫండ్ కావడంలేదు. ఇలా ఎన్ని వందల కోట్లు కంపెనీ ఖాతాలోకి వెళుతున్నాయి? అసలు ఆ డబ్బులు ప్రభుత్వానికి చేరుతున్నాయా? ధరణిలో ఆధార్ , పాన్ వివరాల సమాచారం దేశాలు దాటి వెళుతోంది.

డేటా ప్రైవసీ ప్రకారం దేశ పౌరుల డేటాను విదేశీయులు యాక్సెస్ చేయడానికి వీల్లేదు. ధరణి దోపీడీని మేం బయట పెడితే.. కేసీఆర్ కల్లు తాగిన కోతిలా ఎగురుతున్నారు. 50వేల కోట్లలో 40వేల కోట్లు ప్రభుత్వానికి వెళ్లాయని కొంత మంది అధికారులు చెబుతున్నారు. ఇది వాస్తవమా.. అవాస్తవమా విచారణ చేపట్టాలని అన్నారు.

కేసీర్, కేటీఆర్ సైబర్ నేరగాళ్లు. తెలంగాణ ప్రజల సొమ్మును. దోచుకున్నారు. ధరణిలో జరిగిన 25 లక్షల లావాదేవీలపై ఫోరెన్సిక్ ఆడిట్ జరగాలి. తక్షణమే ధరణి లావాదేవీలపై కేంద్ర ప్రభుత్వం కాగ్ నివేదిక కోరాలని కిషన్ రెడ్డి ని డిమాండ్ చేస్తున్నా. సీసీఎల్ఏ కమిషనర్, చీఫ్ సెక్రెటరీ, సంబంధిత అధికారులపై క్రిమినల్ కేసులు పెట్టాలి. దీనిపై విచారణ సంస్థలకు ఫిర్యాదు చేస్తాం.... అవసరమైతే కోర్టు తలుపు తడతాం. దోపిడీ బయటపడుతుందనే నా ఆరోపణలపై కేసీఆర్ తీవ్రంగా స్పందిస్తున్నారు.

అందుకే కేసీఆర్ రైతులను, ప్రజలను భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ధరణి అనేది కేవలం సాఫ్ట్ వేర్ మాత్రమే కాదు... అది కేసీఆర్ దోపిడీకి గేట్ వే.. లోపాలు లేకుంటే కోర్టు ముందు రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు దోషిగా నిలబడింది? ధరణి మాస్టర్ కీ శ్రీధర్ రాజు దగ్గర ఉంది. తెలంగాణ భూమిలన్నీ ఆంధ్రా శ్రీధర్ రాజుకు కట్టబెట్టారు. శ్రీధర్ రాజు ఏ యువరాజుకు దగ్గరి వాడో తేలాలి. చిత్తశుద్ధి ఉంటే దీనిపై విచారణ జరిపించాలి. లక్షల కోట్ల దోపిడీ జరుగుతున్నా కేంద్రం కేసీఆర్ పై ఎందుకు విచారణకు అదేశించడంలేదు? దీని వెనక ఏ గూడుపుఠానీ ఉందో కేంద్ర పెద్దలే చెప్పాలని రేవంత్ అన్నారు.

# కేసీఆర్ మోసాలను భరించే ఓపిక లేదు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణ ప్రజలకు ఏకైక నాయకురాలు సోనియాగాంధీ. తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీకి కృతజ్ఞతగా రాబోయే ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తీసుకురావాలని టీపీసీసీ ఛీఫ్ రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. పార్టీలోకి వచ్చిన శ్రీహరి రావు సాదర స్వాగతం పలుకుతున్నా. నిర్మల్ జిల్లా నుంచి కాంగ్రెస్ కుటుంబంలో చేరిన వారికి సముచిత గౌరవం, స్థానం దక్కుతుంది. పార్టీ గెలుపు కోసం పనిచేసేవారికి గుర్తింపు లభిస్తుంది. కొందరు పార్టీ వీడితే నాయకులే ఉండరన్నట్లు వ్యవహరించారు. కానీ అంతకంటే బలమైన నాయకులు పార్టీలోకి వచ్చారు. ఖచ్చితంగా నిర్మల్ అసెంబ్లీ లో కాంగ్రెస్ జెండా ఎగరేస్తుంది. కొడంగల్ లో గెలవడం ఎంత ముఖ్యమో నిర్మల్ నియోజకవర్గంలో గెలవడం అంతే ప్రాధాన్యతగా తీసుకుంటామని అన్నారు. ఇంద్రకరణ్ రెడ్డి మంత్రిగా ఉన్నా నిర్మల్ లో డబుల్ బెడ్రూం ఇల్లు కట్టించలేకపోయారు. మంత్రి ఇంద్రకరణ్ రెడ్డికి నేను సవాల్ విసురుతున్నా. ఏ గ్రామంలో డబుల్ బెడ్రూం ఇల్లు కట్టించారో ఆ గ్రామంలో బీఆరెస్ ఓట్లు అడగాలని అన్నారు. ఇందిరమ్మ ఇల్లు కట్టిన ప్రాంతాల్లో మేం ఓట్లు అడుగుతాం. ఇందుకు ఇంద్రకరణ్ రెడ్డి సిద్ధమా? కేసీఆర్ మోసాన్ని భరించే ఓపిక తెలంగాణ ప్రజలకు లేదు. తెలంగాణ సమాజం తిరగబడే సమయం ఆసన్నమైంది. కేసీఆర్ చేతిలో మోసపోయినవారి జాబితాలో శ్రీహరి రావు మొదట్లో ఉంటారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంది.. నిర్మల్ జిల్లాను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తామని అన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో 10కి కనీసం 8 సీట్లు గెలిపించుకోవాలి.ఒక నిశ్శబ్ద విప్లవం, ఒక తుఫాన్ రాబోతుంది. నాయకులు గ్రామాల్లోకి వెళ్లి ప్రతీ గుండెకు చేరాలి. ప్రజల్లో కాంగ్రెస్ పార్టీపై ప్రేమ ఉంది. తలుపు తడితే చాలు ప్రజలు కాంగ్రెస్ ను గెలిపిస్తారు. రాబోయే ఎన్నికల్లో కేసీఆర్ కుటుంబానికి, ప్రజలకు మధ్య యుద్ధం జరగబోతోంది. ప్రజలు కేసీఆర్ కుటుంబాన్ని ఒడిస్తారు. ఆదిలాబాద్ జిల్లా ప్రజలు బీఆరెస్ పార్టీని బండకేసి కొడతారు. శ్రీహరి రావుకు పీసీసీ అధ్యక్షుడుగా అండగా ఉంటానని అన్నారు.

## భారీగా కోకాయిన్ స్వాధీనం
### ఒకరు అరెస్టు



రంగారెడ్డి, ప్రభాత సూర్యుడు : రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ పరిధిలోని కిస్మత్ పూర్ క్రాస్ రోడ్ వద్ద 82 కిలోలకు పైగా కోకాయిన్ ను పోలీసులు పట్టుకున్నారు. ఈ నేపధ్యంలో సుంకర కృష్ణ ప్రసాద్ అనే వ్యక్తిని అరెస్టు చేసారు. 78.50 లక్షల విలువచేసే కొకాయిన్ తో పాటు 2 లక్షల నగదు ను రాజేంద్రనగర్ పోలీసులు మాదాపూర్ ఎస్ఓటి టీమ్స్ స్వాధీనం చేసుకున్నారు.

## రాజ్ భవన్ లో ప్రపంచ రక్తదాన దినోత్సవ వేడుకలు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, తెలంగాణ రాష్ట్ర శాఖా వారి ఆధ్వర్యంలో వరల్డ్ బ్లడ్ డొనర్ డే వేడుకలు ను రాజ్ భవన్ లో ఘనం గా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎక్కువ బ్లడ్ డొనేషన్ చేసిన విభాగం లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా శాఖ కు చెందిన ఎ. వి రావు, యోగెష్ శ్రీవాత్సవ లకు తెలంగాణ రాష్ట్ర గవర్నర్ డా. తమిళ సై సౌందర్య రాజన్ చేతుల మీదుగా వరల్డ్ బ్లడ్ డొనర్ డె మెమొంటొ మరియు సర్టిఫికేట్ లను ప్రదానం చేశారు. ఈ అవార్డు మరియు సర్టిఫికేట్ రావడానికి కారకులైన రెడ్ క్రాస్, హైదరాబాద్ జిల్లా శాఖా చైర్మన్ మామిడి భీమ్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ వేడుకల్లో స్టేట్ టిబి కన్వీనర్ డా. విజయ్ భాస్కర్ గౌడ్, యం సి సభ్యులు రియాజుద్దీన్,ప్రవీణ్ కుమార్, మహేంద్ర రెడ్డి, కల్పన దత్త,వెంకట్, లీలావతీ, తదితరులు పాల్గొన్నారు.

## తొమ్మిదేళ్లలోనే దశాబ్ది ఉత్సవాలు
## నిర్వహించడం హాస్యాస్పదం

- మహిళల పట్ల తెలంగాణ ప్రభుత్వం చిన్నచూపు
- మహిళల హక్కులను కాలరాస్తున్న బిఆర్ఎస్ ప్రభుత్వం
- జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు విజయలక్ష్మి



జగిత్యాల, ప్రభాత సూర్యుడు :

కేవలం పెన్షన్లు ఇచ్చి మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని గొప్పలు చెప్పుకోవడా నికేనా దశాబ్ది ఉత్సవాలు జరుపుతున్నారని మాజీ మున్సిపల్ ఛైర్పర్సన్,జగిత్యాల జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మి దేవెందర్ రెడ్డి ఆరోపించారు. మహిళల హక్కులను కాలరాయడంతో పాటు రైతులను గోస పెట్టుకుంటున్న బిఆర్ఎస్ ప్రభుత్వానికి మహిళల గురించి మాట్లాడే హక్కు లేదని మండి పడ్డారు.బుధవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్ లో జిల్లా మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు తాటిపర్తి విజయ లక్ష్మి దేవేందర్ రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాజ్యాంగంలో అంబేద్కర్ మహిళలకు కల్పించిన హక్కులను తెలంగాణ ప్రభుత్వం కాల రాస్తోందని,బీసీ మహిళకు కేటాయించిన జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ పదవిలో పురుషుని కూర్చోబెట్టి,బీసీ మహిళల స్థానంలో ఓసీ లు రాజ్యం ఏలుతున్నారని, మహిళలకు కేటాయించిన సీట్లలో కుడా మహిళలను ముందుకు రానివ్వడం లేదని ఇందుకేనా ఉత్సవాలని ఆరోపించారు.రాష్ట్ర ప్రథమ పౌరురాలైన గవర్నర్ ను తిట్టిన వారికి ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టారని చెబుతూ ఇదేనా మీరు మహిళలకు ఇచ్చే గౌరవం అని ప్రభుత్వ తీరును నిలదీశారు.నూతన సచివాలయంలోకి మీడియాను కూడా అనుమతించక పోవడాన్ని తప్పుబడుతూ సచివాలయం బీఅర్ఎస్ పార్టీ భవనం కాదని ఆది ప్రజల సొమ్ముతో కట్టిన ప్రజా భవనమని పేర్కొన్నారు.మహిళలకు ఇవ్వాల్సిన పావలా వడ్డీ నాలుగేళ్లుగా ఎందుకు ఇవ్వలేదని,తొమ్మిదేళ్ళ కాలంలో ఏనాడైనా మహిళల సంరక్షణ కోసం సమావేశం ఏర్పాటు చేశారా అని విజయలక్ష్మి ప్రశ్నించారు.అధికారికంగా నిర్వహిస్తున్న దశాబ్ద ఉత్సవాల్లో కాంగ్రెస్ పై విమర్శలు చేయడం ఏమిటని ప్రశ్నిస్తూ మీ పార్టీ అఫీస్ లో మాట్లాడండని హితవుపలికారు.పది కోట్ల విలువైన భూములు కేవలం రు.4.80 లక్షలకే బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలకు కేటాయించడం సరైందికదన్నారు.ఉమ్మడి రాష్ట్రంలో 8 కోట్ల జనాభాకు రు.10 కోట్ల మద్యం అమ్మకాలు ఉంటే నేడు 4 కోట్ల మందికి రు.40 వేల కోట్ల ఆదాయం పెరిగిందని దుయ్యాబట్టారు. తెలంగాణ ఏర్పడిన నాడు 12 లక్షల మంది వితంతువులు ఉంటే నేడు 15 లక్షల మంది వితంతువులు ఉన్నారని, రాష్ట్ర ఆదాయం కోసం తాగుబోతులను చేస్తున్నారనీ ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ములస్తపు లలిత, సహారా అజార్,అల్లాల సరిత, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## యాదాద్రికి 'గ్రీన్ యాపిల్' అవార్డు


జగిత్యాల, ప్రభాత సూర్యుడు : తెలంగాణ ప్రజల ఇలవేల్పు యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయానికి లండన్‌లోని గ్రీన్ ఆర్గనైజేషన్ యొక్క ప్రతిష్ఠాత్మక గ్రీన్ యాపిల్ అవార్డు లభించడం పట్ల దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. అద్భుతమైన మతపరమైన నిర్మాణాల విభాగంలో యాదాద్రి ఆలయానికి గ్రీన్ యాపిల్ అవార్డు రావడం తెలంగాణ రాష్ట్రానికి దక్కిన అపూర్వ గౌరవమని మంత్రి తెలిపారు. స్వయం పాలనలో తెలంగాణ రాష్ట్రానికి ఎన్నో జాతీయ, అంతర్జాతీయ అవార్డులు దక్కడం మనందరికి గర్వకారణమని పేర్కొన్నారు. స్వయంభువుగా వెలిసిన 13వ శతాబ్దంనాటి స్వామివారి విగ్రహానికి ఎటువంటి నష్టం జరగకుండా, ప్రధాన ఆలయంలోకి సహజ సిద్ధంగా గాలి, వెలుతురు వచ్చే విధంగా, ఆలయ పరిసరాల్లో 40 శాతం గ్రీనరీతో విద్యుత్తు వినియోగాన్ని సాధ్యమైనంత మేరకు తగ్గించేలా ఈ ఆలయాన్ని అద్భుతంగా నిర్మించడంతో అంతర్జాతీయ అవార్డు లభించినట్లు మంత్రి వెల్లడించారు. సీఎం కేసిఆర్ మార్గనిర్దేశంలో ఆలయ పునర్నిర్మాణంలో భాగస్వాములైన ప్రతిఒక్కరికి ఈ సందర్భంగా మంత్రి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

## అమిత్ షా తెలంగాణ పర్యటన వాయిదా

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు : కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన వాయిదా పడింది. అరేబియా సముద్రంలో ఏర్పడిన తీవ్ర తుపాను బిపర్ జాయ్ కారణంగా రేపు కేంద్ర హోం మంత్రి పర్యటనను రద్దు చేశారు. ఈ విషయాన్ని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు బండి సంజయ్ తెలిపారు. ఖమ్మంలో నిర్వహించే సభ తేదీని త్వరలోనే ప్రకటిస్తామని చెప్పారు. షెడ్యూల్ ప్రకారం ఈ అర్ధరాత్రికి అమిత్ షా హైదరాబాద్ కు చేరుకోవాల్సి ఉంది. రేపు ఖమ్మంలో నిర్వహించే భారీ బహిరంగసభలో పాల్గొనాల్సి ఉంది. ఈ తుపాను కారణంగా ముఖ్యంగా మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాలు ఇప్పటికే తీవ్రంగా ప్రభావితమవుతున్నాయి. ఎన్డీఆర్ఎఫ్ టీములు ఇప్పటికే ఆయా రాష్ట్రాల్లో మోహరించాయి. రెస్క్యూ ఆపరేషన్స్ ను అమిత్ షా స్వయంగా పర్యవేక్షిస్తున్నారు

## సత్య దేవుడికి పవన్ కళ్యాణ్ ప్రత్యేక పూజలు

అన్నవరం- ప్రభాత సూర్యుడు



జనసేనాని పవన్ కళ్యాణ్ వారాహి యాత్ర ప్రారంభించారు. యాత్ర ప్రారంభానికి ముందు అన్నవరం సత్యనారాయణ స్వామిని దర్శించుకున్నారు. స్వామి వారి ఆశీస్సులు తీసుకున్నారు. ఆలయ అర్చకులు పవన్ను ఆశీర్వదించి క్షేత్ర విశేషాలు వివరించారు. పవన్ రాకతో భక్తులు, జనసైనికులు, అభిమానులు అన్నవరం క్షేత్రానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అన్నవరంలోని ఆలయానికి ఉదయం 10 గంటలకు రత్నగిరి శ్రీ సత్యదేవుని సన్నిధికి పవన్ కల్యాణ్ చేరుకొన్నారు. తొలుత సత్యదేవుని సన్నిధిలోని త్రిమూర్తులకు, ఆ తర్వాత సత్యదేవుడి పాదాల చెంత స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారికి తన మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ధ్వజస్తంభం సమీపంలో ఆలయ అర్చకులు పవన్ కళ్యాణ్కు వేదాశీర్వచనాలు అందచేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీ సత్యదేవుని పటం అందించారు.

## సీఎం, డీసీఎంలు సహా
## 36 మంది కాంగ్రెస్ నేతలకు కోర్టు సమన్లు

బెంగళూరు, ప్రభాత సూర్యుడు



సీఎం సిద్ధ రామయ్య, డీసీఎం డీకే శివకుమార్ తోపాటు 36మంది కాంగ్రెస్ ముఖ్యులకు కోర్టు సమన్లు జారీ చేసింది. బెం గళూరు ప్రజా ప్రతినిధుల కోర్టు మంగళవారం సమన్లు జారీ చేసింది. జూలై 28న స్వయంగా కోర్టుకు హాజరు కావాలని సూచించింది. బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిబంధనలు ఉల్లంఘించి కాంగ్రెస్ పార్టీ ఆందోళన చేసిన మేరకు కోర్టు స్పందించింది. కంట్రాక్టర్ సంతోష్ పాటిల్ మృతి నేపథ్యంలో మంత్రి ఈశ్వరప్పను కేబినెట్ నుంచి తొలగించాలని కాంగ్రెస్ నేతలు, అప్పటి సీఎం బసవరాజ్ బొమ్మై నివాసం ఎదుట ఆందోళన చేశారు. హై గ్రౌండ్స్ పోలీస్ స్టేషన్‌లో 36మందిపై కేసులు న మోదై ఉండేవి. సీఎం, డీసీఎంలతోపాటు రాష్ట్ర పార్టీ వ్య వహారాల ఇన్‌చార్జ్ రణదీప్‌సింగ్ సుర్జేవాలాకు సమన్లు జారీ అయ్యాయి.

## బాలికల కళాశాల వసతి గృహంలో
## ప్రవేశాలకు ధరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల, ప్రభాత సూర్యుడు

జగిత్యాల జిల్లా కేంద్రంలోని గొల్లపల్లి రోడ్డు బైపాస్ చౌరస్తా సమీపంలో గల షెడ్యూల్డ్ కులాల ప్రభుత్వ బాలికల కళాశాల వసతిగృహం -1 లో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కే రాజకుమార్ ఆదేశాల మేరకు అర్హులైన బాలికలు అడ్మిషన్లు పొందుటకు దరఖాస్తు చేసుకోవాలని వసతి గృహ సంక్షేమ అధికారిణి శ్రీలత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ ప్రథమ ద్వితీయ సంవత్సరం చదువుతున్న బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వసతి గృహంలో 55 ఖాళీలకు గాను ఎస్సీలకు 50, ఎస్టీలకు 5 సీట్లు కేటాయించామని పేర్కొన్నారు. అర్హులైన వారు వసతి గృహంలో నేరుగా సంప్రదించాలని లేదా మొబైల్ నెంబర్9014870770కు సంప్రదించాలని సూచించారు.

### అందరికి అందుబాటులో హయత్ నగర్

## నూతనవార్డు కార్యాలయం

### కార్పోరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి



**హయత్ నగర్ - ప్రభాత సూర్యుడు :** ఈ నెల 16వ తేదీన ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న హయత్ నగర్ డివిజన్ నూతన వార్డు కార్యాలయం డివిజన్ ప్రజలందరికీ అందుబాటులో ఉండే విధంగా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని కార్పోరేటర్ కళ్ళెం నవజీవన్ రెడ్డి అన్నారు. సరూర్‌నగర్‌లోని ఎల్‌బీ నగర్ జోనల్ కార్యాలయంలో కమీషనర్ పంకజ ఆద్వర్యంలో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా హయత్ నగర్ డివిజన్ పరిధిలో నూతనంగా ఏర్పాటు కానున్న వార్డు కార్యాలయంలో వివిధ శాఖల అధికారుల అందుబాటులో ఉండేలా మరియూ పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి కమీషనర్ మారుతీ దివాకర్, కార్పోరేటర్‌లు కొప్పుల నర్సిహా రెడ్డి, చింతల అరుణ సురేందర్ యాదవ్, లచ్చిరెడ్డి మరియూ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆర్థికసాయం అందజేత



**అబ్దుల్లాపూర్‌మెట్ - ప్రభాత సూర్యుడు :** అనారోగ్యంలో చనిపోయిన బిఆర్ఎస్ పార్టీకి చెందిన కార్యకర్త కుటుంబానికి బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేషం 10,000/- రూపాయల ఆర్ధికసాయం మంగళవారం అందజేశారు. పెద్ద అంబరపేట్ మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు అంబికానగర్ కాలనీ వాసి బాలాజీ ఇటీవల అనారోగ్యంలో మృతిచెందారు. స్థానిక నాయకుల ద్వారా సమాచారం తెలుసుకున్న క్యామ మల్లేషం మృతుని కుటుంబ సభ్యులను కలసి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ గంట శ్రీనివాస్ రెడ్డి, రాయపోలు మాజీ సర్పంచ్ అశోక్ గౌడ్, మాజీ కౌన్సిలర్ చెరుకూరి రేణుక జగన్, టిఆర్ఎస్‌వి నాయకుడు పాలడుగు నాగార్జున, ముత్తినేని యాదయ్య, ఆరుకొండ లింగస్వామి, వరికుప్పల శ్రీనివాస్, రవీందర్ రెడ్డి, లింగారెడ్డి, మల్లేషం, మరియూ కాలనీ వాసులు పాల్గొన్నారు.

### కేసిఆర్ పాలనలో

## వైద్య వ్యవస్థలో మార్పు

### ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి



**ఇబ్రహీంపట్నం - ప్రభాత సూర్యుడు:** తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ధి ఉత్సావాల్లో భాగంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం పరిధిలోని కళ్ళెం జంగా రెడ్డి గార్డెన్‌లో వైద్య ఆరోగ్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి మాట్లాడుతూ..ముఖ్యమంత్రి కేసిఆర్ పాలనలో తెలంగాణ వైద్య వ్యవస్థ ఎంతో మెరుగు పడిందని, గర్భినీ స్త్రీలకు కేసిఆర్ కిట్లు, పౌష్టికాహర పథకాలు అందజేస్తుందని తెలిపారు.

అనంతరం కేసిఆర్ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ వెంకటా చారి, పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ చైర్ పర్సన్ చెవుల స్వప్న చిరంజీవి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్తు వెంకట రమణా రెడ్డి, మరియూ ఇతర వైద్య అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

### నిమ్స్ లో 2000 పడకల

# ఆస్పత్రికి శంకుస్థాపన

### రూ.1571 కోట్లతో నిర్మాణం



**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు** నిమ్స్‌లో కొత్తగా నిర్మించబోయే బ్లాక్‌కు సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు. హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్‌లో ఏర్పాటు చేసిన ఈ బ్లాక్‌కు దశాబ్ధి బ్లాక్ అని పేరు పెట్టారు. ఈ బ్లాక్ ఏర్పాటుతో నిమ్స్‌లో మరో 2000 పడకలు అందుబాటులోకి రానున్నాయి. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య మంత్రితోపాటు ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు, మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే దానం నాగేందర్ పాల్గొన్నారు. మొత్తం 33 ఎకరాల్లో నిమ్స్ విస్తరణ పనులు చేపట్టారు. భవిష్యత్తులో పెరుగనున్న రద్దీ, విస్తృతం కానున్న స్పెషాలిటీలను దృష్టిలో పెట్టుకొని విస్తరణ పనులు జరగనున్నాయి. మూడు బ్లాకులు ఈ కొత్త దశాబ్ధి భవనం నిర్మించనున్నారు. 8 అంతస్థుల్లో ఓపీ బ్లాక్, ఎమర్జెన్సీ సేవలకు 8 అంతస్థుల బ్లాక్, ఇన్‌పేషంట్ల కోసం 13 అంతస్థులతో బ్లాక్ సిద్ధం చేయనున్నారు. కొత్త భవనంలో 30 ఆపరేషన్ థియేటర్లు ఉంటాయని తెలుస్తోంది. 2 వేల పడకి కూగా ఆక్సిజన్ సరఫరా ఉంటుంది. ఇందులో 1,200 ఆక్సిజన్ బెడ్లు, 500 ఐసీయూ బెడ్లు ఉంటాయి. ప్రత్యేక గది కావాలనుకునే రోగుల కోసం కొత్తగా 300 పేయింగ్ రూమ్స్ కేటాయిస్తారు. ప్రస్తుతం 30 విభాగాలు ఉండగా.. విస్తరణతో వీటి సంఖ్య 35 కానుంది. నిమ్స్‌కు కేసీఆర్ ప్రభుత్వం 2014-15లో 185 కోట్లు కేటాయించారు. తర్వాత 2022లో 242 కోట్ల రూపాయల నిధులు ఇచ్చారు. ప్రస్తుత ఏడాది రూ.290 కోట్లు కేటాయించారు. 2014 నాటికి నిమ్స్‌లో 900 పడకలు మాత్రమే ఉండేవి. తర్వాత ఆ సంఖ్యను ప్రభుత్వం 1489కి పెంచింది. ఇప్పుడు మరో 2000 పడకల నిర్మాణానికి పనులు ప్రారంభం అయ్యాయి. 2014 నాటికి 111 మంది మాత్రమే టీచింగ్ స్టాప్ ఉండే వాళ్లు. గతేడాది మరో 150ని నియమించారు. ఇప్పుడు అక్కడ బోధనా సిబ్బంది 264కు చేరింది. రెసిడెంట్ డాక్టర్ల కేటాయింపును కూడా పెంచారు. ప్రస్తుతం 169 మందిని కేటాయిస్తున్నారు. 2014 -2021 మధ్య నిమ్స్‌లో 90 కోట్ల రూపాయల విలువైన పరికరాలను కొనుగోలు చేశారు. 2022లో మరో రూ.153 కోట్ల పరికరాల కోసం ఆర్డర్ ఇచ్చారు. 2014తో పోల్చితే ఓపీ 26%, ఐపీ 91% పెరిగాయని ప్రభుత్వ రికార్డులు చెబుతున్నాయి. నిమ్స్ ఆరోగ్యశ్రీ కింద లక్షన్నర మంది లబ్ధిపొందారు. 32 మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లు, 6 మేజర్ మాడ్యులర్ థియేటర్లు దీనిలో నిర్మించనున్నారు. మొత్తం మూడు బ్లాకులలో నిమ్స్ టవర్ నిర్మించనున్నారు. శంకుస్థాపన అనంతరం సీఎం కేసీఆర్ మాట్లాడుతూ..వైద్యానికి, మానవజీవితానికి ఎడతెగని బంధం ఉన్నట్లు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కరోనాను మించిన వైరస్ వచ్చే అవకాశముందని, వాటిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. తెలంగాణలో వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు వివరించారు.మానవజాతి ఉన్నన్ని రోజులు వైద్య రంగం ఉండాల్సిందే.. 2014లో 2వేల కోట్ల బడ్జెట్ అయితే, 2023లో 12వేల కోట్లు వైద్యశాఖకు కేటాయింపులు జరిపినట్లు సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. ఆక్సిజన్ కోసం కేంద్రాన్ని అడుక్కోకుండా ఆక్సిజన్ మనమే తయారు చేసుకుంటున్నామన్నారు. వందల పడకల ఆసుపత్రులను.. వేల సంఖ్యకు పెంచుకున్నామన్నారు. రాబోయే రోజుల్లో కరోనాను మించిన వైరస్ లు వస్తాయి.. ఎలాంటి విపత్కర పరిస్థితుల్లో ఎదురైనా ఎదురుకునేందుకు తెలంగాణ వైద్యశాఖ రెడీగా ఉందంటూ సీఎం స్పష్టంచేశారు. బెస్ట్ ప్లానింగ్ ఆఫ్ సక్సెస్ అనే నినాదం ఉన్నత వైద్యాధికారులు మర్చిపోవద్దంటూ కోరారు. వైద్యారోగ్య శాఖలో పీఆర్ తక్కువ అందుకే విమర్శలు వచ్చిపడుతున్నాయి. వైద్యోనారాయనో హరి అంటారు.. ఎంఎ లు అయినా ముఖ్యమంత్రి అయినా రోగం వస్తే డాక్టర్ దగ్గరకు వెళ్లాల్సిందే. పోలీస్ ప్రొఫైల్ ను పూర్తిగా మార్చి.. ఫ్రెండ్లీ పోలీస్ గా మార్చాము. వైద్యశాఖ ప్రజలకు చేసే సేవ ప్రజలకు తెలిసేలాగా పీఆర్ పెంచాలి. వైద్యారోగ్యశాఖ లో ప్లానింగ్ ఇంకా బాగా మెరుగ్గా ఉండాలంటూ సూచించారు. కొత్త భవనాలు, నూతన ఈక్విప్మెంట్ తేవడం కాదు అది ప్రజలకు ఉపయోగపడాలని.. కరోనా లాంటి మహమ్మారి మళ్ళీ వచ్చినా ప్రజలకు మేమున్నాం అనే ధైర్యం డాక్టర్లు ఇవ్వాలని పేర్కొన్నారు. డాక్టర్లు పనిచేయడం లేదనే విమర్శ ఉందని.. అది తొలిగిపోయేలా మీ పనితీరు మార్చుకోవాలంటూ సీఎం కేసీఆర్ పేర్కొన్నారు.



### ముఖ్యమంత్రి సహాయనిది


# పేదలపాలిట వరం

### బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి





**ఇబ్రహీంపట్నం - ప్రభాత సూర్యుడు** తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత ప్రభుత్వం అందిస్తున్న ముఖ్యమంత్రి సహాయనిధి ఎందరో పేద ప్రజలకు సంజీవినిలా మారిందని, నేడు తెలంగాణ ప్రజలు ముఖ్యమంత్రి సహాయనిధిని వరంలాగా భావిస్తున్నారని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర యువ నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్ రెడ్డి అన్నారు. ఆసుపత్రి పాలై ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న ఇబ్రహీంపట్నం నియోజకవర్గం పరిధిలోని దండుమైలారం గ్రామానికి చెందిన అడవమ్మకు 60,000/-, నర్సమ్మకు 38,000/-, ఆధిబట్ల మున్సిపాలిటీ మంగళ్ పల్లికి చెందిన బాలకృష్ణకు 33,000/-, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ ఖానాపూర్‌కు చెందిన బుగ్గ రాములుకు 25,000/- రూపాయల విలువ చేసే ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు మంగళవారం అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే మంచి రెడ్డి కిషన్ రెడ్డి సహకారంతో నలుగురు లబ్ధిదారులకు వేర్వేరుగా 1,56,000/- రూపాయల మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేసిన అనంతరం ప్రశాంత్ రెడ్డి మాట్లాడతూ..తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న పథకాలన్ని అర్హులైన పేదలందరికి తప్పక అందేలా చూస్తామని తెలిపారు.



Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215